# బంగారు పంజరం

**నా** పేరు సత్యవతి. లక్ష్మీనగర్ కాలనీలో మా కాపురం. అద్దె ఇల్లు కాదు సుమండీ! స్వంత ఇల్లే! మా మామగారు కట్టించిపోయింది. కాలనీలో ఇళ్ళన్నీ బాగానే ఉంటాయనుకోండి. మా ఇల్లు మరీ ప్రత్యేకం. సైజులో చిన్నదే అయినా అన్ని సదుపాయాలూ ఉన్నాయి. చుట్టూరా చిన్న తోటగూడా ఉంది. నేను కాపురానికి వచ్చిన కొత్తలో మా వారి మేనత్త ఒకావిడ మా ఇంటికొచ్చి నాలుగు రోజులుండి పోయింది. వెళ్తూ వెళ్తూ ఆవిడ 'ఒరే రాఘవా! నువ్వదృష్టవంతుడివిరా! నీ ఇల్లూ బాగుంది, నీ ఇల్లాలూ బాగుంది' అంటూ ఒక మంచిమాట చెప్పి పోయింది. అప్పుడు నేనెంతగా పరవశించిపోయి ఉంటానో మీరు ఊహించుకోగలరు. భారతీయ గృహిణికి అంతకుమించిన ఆనందం ఏముంటుంది?

నా వయసు ఇరవై ఒకటి. పెళ్ళయి ఎనిమిది నెలలయింది. కాపురానికొచ్చి ఆరునెలలు దాటింది. ఈ పాటి స్వల్ప జీవితంలో ఏమంత పెద్ద కథ ఉంటుందని మీరనుకోవచ్చు. దయచేసి అలా అనుకోవద్దు. వినదగిన సౌజన్యం మీలో ఉంటే తప్పకుండా విని తీరవలసిన కథనాది.

అదిగో నాకు తెలుసు–మీరప్పుడే భయపడి పోతున్నట్టున్నారు! ఒకానొక అయినింటి కోడలు తన సోది చెప్పుకోడం గనుక ప్రారంభిస్తే భర్త వల్ల కలిగే నిరాదరణ, అత్తగారు పెట్టే హింస, ఆడపడుచులు కల్పించే ఆరడి మొదలైన వినరాని విషయాలను గురించి వినవలసి వస్తుందేమోనన్న సందేహం కలగడం సహజమే. కానీ అలాంటి బాధలేవీ నాకు లేవని చెప్పుకోడానికి సంతోషిస్తున్నాను. అత్తగారు తన నలుగురు కొడుకుల్లో ఒక్కొక్కరి దగ్గర మూడేసి నెలలుంటుంది. వర్షాకాలంలో వానలు కురవడం రివాజైనట్టు, ఆ మూడు నెలల్లోనూ సూటి పోటు మాటల చమక్కులకు, మూతి విరుపుల విభ్రమాలకు, విసురుకుంటూ వెళ్ళే విన్యాసాలకు కొరత ఉండదు. అయినా ఆ చిరు జల్లులకు నేను తట్టుకోగలను. ఆడపడుచులు పాపం, వాళ్ళ కాపురాల్లో ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉన్నారు. నాకు వాళ్ళ తాకిడి గూడా అంతంత మాత్రమే! లేని బాధలు లేకపోగా భార్యను ముద్దు ముచ్చటలకు నిలయంగా, మురిపాలకు ముదిగారాలకు సదనంగా చూచుకునే భర్త దొరకడం ఎంత భాగ్యం! కానీ ఎటొచ్చీ ప్రేమ ఎక్కువైనా నిభాయించుకోడం కష్టమే! జైలు కాపలా వాడికైనా శెలవనేది ఉంటుంది. నాకా మాత్రం ప్రాప్తంకూడా లేకపోయింది.

"ఏమండి! ఒకసారి మా ఊరికి వెళ్ళొద్దామండి! మా అమ్మా, నాన్నా కళ్ళల్లో మెదిలినట్లున్నారు. అక్కయ్యలిద్దరికి పెళ్ళయిన తర్వాత వాళ్ళు నన్ను చూచుకుంటూ బ్రతికారు. నేనయినా పట్టుమని పదిరోజులు వాళ్ళని వదిలిపెట్టి ఉండినదాన్నిగాను, ఏమండి – ప్లీజ్ – మూడంటే మూడే రోజులండీ!" అంటూ నేనెన్నోసార్లు ప్రాధేయపడ్డాను.

కానీలే, చూద్దాంలే – అన్న ధోరణిగూడా ఆయనలో కానవచ్చేది గాదు. ఈ ఒక్క కోరిక విషయంలో మాత్రం ఈయన నా పాలిటికి వరమివ్వని వేలుపై పోయారు.

లేదంటే ఉండి ఉండీ 'ప్చ్, వెళ్ళి బావుకునేదేముందిలే!" అంటూ ఒక పుల్లవిరుపు మాటను సంధించే వారు.

"బావుకునే మాటగాదండీ! మా వాళ్ళు నా కంచంలో మెరుగు బంగారమేమీ పెట్టలేదు. నేను వెళ్ళడం వల్ల వాళ్ళకు ఒరిగేదైనా ఏమీ ఉండదు. లేదంటే ముసలి ముప్పులో ఎవరైనా తమ బిడ్డల దగ్గరినుంచీ ఇంత ఆదరం, ఇంత ఆప్యాయతా ఆశిస్తారు. వాళ్ళకది చెల్లించొచ్చుగదా! పోనీ, నేనొక్కదాన్నే వెళ్ళొచ్చేస్తానండి! వెళ్ళినరోజు, వచ్చే రోజుగాక మధ్యలో ఒక్కరోజు మాత్రం అక్కడుంటాను" అని కన్నీళ్ళు పెట్టుకుంటూ బ్రతిమాలుకున్నాను.

గట్టిగా ఇలా నేను పట్టుపట్టినప్పుడల్లా నా ధ్యాసను మళ్ళించడంకోసం ఈయన కొన్ని ఉపాయాలూ అన్వేషిస్తారు. సాయంకాలానికల్లా ఒక కొత్తచీర పట్టుక రావడం, సినిమాకు తీసుకెళ్ళడం, పిక్నిక్ ప్రోగ్రాం ఏర్పాటు చెయ్యడం ఇలాంటివి ఆయన చేతలు, ఏడిచే బిడ్డ చేతికి పచ్చి వెలక్కాయ ఇచ్చినట్టే ఉంటాయి మరి. అత్తగారిల్లంటే ఈయనకిలా ముఖం మొత్తినందుకు కారణమేమిటా అని నాలో నేను ఆలోచించుకునే దాన్ని.

నేను పుట్టిన ఊరుగూడా పెద్ద టౌనే. కానీ పుట్టిన ఇల్లు మాత్రం మేడగాదు. పెంకుటిల్లు. సాలీడు గూడులా అల్లుకున్న అక్కడి సందుగొందుల్లో మా ఇంటి ఉనికిని కనిపెట్టడంగూడా కష్టమే. ముప్పై మూడేళ్ళు మునిసిపాలిటీ బడిలో టీచరుగా పనిచేసి మా నాన్నగారు సంపాదించుకున్నదల్లా ఆ ఇల్లు మాత్రమే. ఒకప్పుడది బాగా బ్రతికిన ఇల్లే! అన్నదమ్ములు విడిపోయి పొడుగునా గోడలు పెట్టుకున్నారు. అందులో ఒకతను ఏ కారణంవల్లనో తన వంతుకు వచ్చిన వాటాను అమ్మదలచుకుంటే, దాన్ని మా నాన్నగారు కొనుక్కున్నారు. ముందువైపు చిన్న వసారా. అది దాటుకున్నాక అంతకు రెండింతల హాలు. దానికవతల వంటగది. చివర నాలుగు బారల చతురస్రంగా పెరడు. ఎండకు మాడిపోకుండా వానకు తడిసి ముద్దగాకుండా, చలికి పిడచ గట్టుకపోకుండా, ఆ ఇల్లు మేము తలదాచుకోడానికి బాగానే ఉపకరించింది. ఆ ఇల్లు మాదని చెప్పుకోడానికి నేనెప్పుడూ కించపడిపోలేదు సరిగదా, ఆ మాట చెప్పుకోడానికి నాకెంతో సంబరంగానే ఉండేది. పండుగలు, పబ్బాలు వచ్చినప్పుడల్లా నేను మా ఇంటి ముందర రథం ముగ్గు, పూల పల్లకి ముగ్గు, నూరు దీపాల ముగ్గు, ఇంకా అలాంటి పెద్ద పెద్ద ముగ్గులు వేసేదాన్ని. 'సత్య ముగ్గులెంత బాగా వేస్తుం'దంటూ మా వీధిలో వాళ్ళందరూ నన్ను తెగమెచ్చుకునే వాళ్ళు. గుడికి వెళ్ళాలన్నా, సినిమాకు వెళ్ళాలన్నా మా ఎదురింటి శాంతమ్మ వదిన, పక్కింటి రాజేశ్వరి పిన్ని, మూడో ఇంటి తులసమ్మత్త, డిప్యూటీ తాశీల్దారుగారి అమ్మాయి శ్యామల – అందరమూ కలసి వెళ్ళేవాళ్ళం. ఎవరింట్లో ఏ ఫలహారం చేసినా, అందరికీ పంచిపెట్టేవాళ్ళం. లైబ్రరీకి ఏ కొత్త నవల వచ్చినా ముందుగా తెప్పించుకుని చదివేసే రాజేశ్వరి పిన్ని తాను చదివిన కథలన్నీ పూసగ్రుచ్చినట్టుగా చెబుతుండేది. ఒక సినిమా గనుక చూచి వచ్చేశామంటే మళ్ళీ పది రోజుల దాకా అందును గురించే మాట్లాడుకునే

వాళ్ళం. ఇప్పుడు తలుచుకుంటే ఆ తియ్యటి కల పూర్తిగా చెరిగిపోయినట్టుంది. ఈ లక్ష్మీనగర్ కాలనీలో మేడలున్నాయి. మనుషులున్నారు. కానీ ఒకరిని గురించిన ధ్యాస ఇంకొకరికి ఉండదు. ఒకరి ఉనికిని ఇంకొకరు గుర్తించరు. ఎవరికి వారిదే ఒక ఒంటి స్తంభపు మేడ! అంతెందుకు, మా ఇంటి కెదురుగా ఉన్న మేడలో ఇంజనీరుగారున్నారు. ఆయన భార్య పూల గుమ్మటంలా ఉంటుంది. ఎల్లప్పుడూ అయిదు వందలకు తక్కువ చేయని చీరలే కడుతుంది. ఓరోజు ఎవరో మా వారి కోసం వాకబు చేస్తూ వస్తే ఆవిడ పెదవి విరిచి 'రాఘవరావా! ఎవరో తెలియదు. ఎదురింట్లో వాళ్ళకు తెలిసి ఉండొచ్చు. అడిగి చూడండి, అంటూ మా ఇంటివైపు చూపింది. అప్పుడు నేను బయటి గుమ్మం దగ్గరే నిలబడి ఉన్నాను.

భగవంతుడు నా తల్లితండ్రులకు మగసంతు ఇవ్వలేదు. ముగ్గురు కూతుళ్ళకూ మంచి సంబంధాలు చూచి పెళ్ళి చేయగలిగితే చాలునన్న ధీమా నాన్నగారి జీవిత ధ్యేయమై పోయింది. అక్కయ్య లిద్దరి తర్వాత ఇక బిడ్డలు లేరనుకున్నాక ఏడేళ్ళ ఎడంగా నేను పుట్టాను. నాకు పెళ్లి చేయవలసి వచ్చేటప్పటికి మా నాన్నగారు రిటయిరైపోయారు. అయినా తన ఆశయానికి అనుగుణ్యంగా ఆయన వీలయినంత ఘనంగానే శుభకార్యం జరిపించారు. పెళ్ళి సత్రానికిచ్చిన బాడుగే వెయ్యి రూపాయలు. వంట వాళ్ళకు ఏడు వందల యాభై. భోజనాల ఖర్చు నాలుగు వేల దాకా ప్రాకింది. అయినా మాకు కాస్త ఆనందం లభించినట్టే లెక్క. వివాహ సందర్భంలో మగ పెళ్ళి వాళ్ళ ముఖాలన్నీ ఎంతో ప్రసన్నంగా ఉన్నట్టే తోచింది.

ఇంటల్లుడి హోదాలో తొలిసారిగా మా వారు ఉగాది పండుగకు అత్తారింటికి వచ్చారు. అక్కడున్న ఒక్క రోజూ ముళ్ళపైన నిల్చున్నట్టే ఉన్నారు. మరునాటి ఉదయం నన్నక్కడినుంచి బయల్దేర దీశారు.

దారిలో ఆయన అడిగారు "ఏం సత్యా! ఆ ఇంట్లో మీరెంతకాలంనుంచీ ఉంటున్నారు?" అని.

"మా అక్కయ్యలూ నేనూ పుట్టిందీ తక్కుతూ తారుతూ నడక నేర్చిందీ, మాటాడ్డానికి నేర్చిందీ, పావడాలు కట్టిందీ, పరికిణీలు వేసిందీ అంతా అక్కడేనండీ!" అన్నాను.

"సరిపోయిందిలే! అదొక ఇల్లా? కొండ గుహ అను. సొరంగం అను. ఒప్పుకుంటాను. వెలుతురు లేదు. గాలి రాదు, ఎలా ఉంటారబ్బా? నా మట్టుకు నేను జైలు గదిలోనైనా ఉంటాను గానీ, మీ ఇంట్లో మాత్రం ఉండలేను" అన్నారాయన.

"మీ రెందుకుంటార్లెండి! ఎప్పుడైనా ఏడాదికి రెండు మూడుసార్లు వస్తారేమో వచ్చినప్పుడు రెండు రోజులుంటారేమో" అంటూ నేను కొంచెం సర్దుబాటు కోసం ప్రయత్నించాను.

"అబ్బే, ఎందుకులే సత్యా! మనం వెళ్ళడమెందుకు, వాళ్ళని ఇబ్బంది పెట్టడమెందుకు?" అన్నారాయన కచ్చితంగా.

అనడమేగాదు, నాటికీ నేటికీ అక్షరాలా ఆ మాటమీద నిలబడిపోయారు.

దీపావళికింక పదిరోజులుంది. అప్పుడైనా పంపిస్తారో, పంపించరో?

వెయ్యి కళ్ళతో వేచి చూస్తున్న మా నాన్నగారి ఉత్తరం రానే వచ్చింది. అందులో ఆయన చేసిన ప్రతిపాదన చూశాక, నాకు నోట మాట రాలేదు. కరెంటు షాక్ తిన్నట్టుగా బిగుసుకుపోయాను.

"అమ్మా, సత్యా! దీపావళికి అల్లుడుగారూ, నువ్వూ తప్పకరావాలి. మీకోసం వేచి ఉంటాము. ఒక చిన్న సవరణ, మునిసిపల్ స్కూల్లో నాతో కలిసి పనిచేసిన పరంధామయ్యగారిని ఎరుగుదువు గదా! ఇటీవల వానల్లో ఆయన అద్దెకుండిన ఇల్లు కూలిపోయింది. ప్రాణాల కపాయంలేక పోవడం దైవఘటన. పులిమీద పుట్రలాగా ఇదాయన కోడలికి ప్రసవ సమయం. గత్యంతరం లేని పరిస్థితిలో ఆయన కుటుంబానికి మన ఇంట్లో ఆశ్రయమివ్వాల్సి వచ్చింది. అందుకని మీకోసం ప్రత్యేకమైన ఏర్పాటు చేయక తప్పింది గాదు. అన్యథా భావించవద్దు. హోటల్ స్వాతిలో మీకోసం ఒక గది 'బుక్' చేసి ఉంచాను. మీరు బస్టాండులో దిగి నేరుగా హోటలుకు వచ్చేయండి. కౌంటరులో అడిగితే, అక్కడున్న వ్యక్తి రూము తాళంచెవి ఇవ్వగలడు. మిగిలిన విశేషాలూ సముఖంలో"

-ఇట్లు,
మీ నాన్న.

"ఏమిటి సత్యా ఏం రాశారు మీ నాన్నగారు?" అంటూ ఉత్తరాన్ని చేతికి తీసుకున్నారు శ్రీవారు, చదివారే గానీ ఆయన ముఖంలో మార్పేమీలేదు.

"ఇందులో నిర్ఘాంతపడి పోవడానికేముంది సత్యా? ఈ రోజుల్లో ఇదంతా మామూలే! పెళ్లిచూపులు, పెళ్ళిళ్ళు, రిసెప్షన్లు, అంతెందుకు, శోభనాలుగూడా హోటళ్ళలోనే జరుగుతున్నాయి. మంచిదేలే! వాళ్ళకూ మనకూ గూడా ఇబ్బంది ఉండదు."

మొత్తానికి అల్లుడు గారికి తగిన మందే మామగారు ప్రిస్క్రయిబ్ చేశారు.

మేము వెళ్ళాము. హోటలు రూంలోనే దిగాము. పుట్టిల్లు ఊళ్ళోనే ఉండగా హోటలు గదిలో దిగినందుకు నాకు తల కొట్టేసినట్టుండిపోయింది. గదిలోనుంచీ వెలుపలికి రాలేకపోయాను. అమ్మ ఫలహారాలతో, పచ్చళ్ళతో, గడ్డపెరుగుతో మృష్టాన్నాలు కారియర్‌లో పెట్టి పంపింది. నాన్నగారు భారీ ఖర్చుతోనే మాకు కొత్త బట్టలు పెట్టారు. సత్కారాల కేమీ లోపం లేదు. కానీ ఒకటే తీరని కొరత. నేను మా ఇంటికి వెళ్ళలేదు. మా ఎదురింటి శాంతమ్మ వదిన కూతురు - నాలుగేళ్ళ పాప - శశికళతో ఆడుకోలేదు. ప్రక్కింటి రాజేశ్వరి పిన్నితో కొత్త నవలల్ని గురించి కబుర్లు చెప్పుకోలేదు. మా ఇంటి పెరట్లో నేను నాటిన కరివేపాకు చెట్టు ఎంత ఎత్తుకు పెరిగిందో చూచుకోలేదు.

జీవితంలో కొన్ని కొన్ని చిన్న కోరికలుగూడా తీరకపోవడం గురించి తలచుకుంటే గుండెలో గుండుసూదులు దిగినట్టే ఉంది.

దీపావళి మరునాడు మా ఊరినుండి మేము తిరిగి వచ్చేశాము. సురక్షితంగా వచ్చిచేరామని వ్రాసిన ఉత్తరానికి నాన్నగారి దగ్గరనుంచీ బదులు రాలేదు. రోజులు బరువుగా గడుస్తున్నాయి. ఒకనెల రోజులు బరువుగా దొర్లిపోయాయి. నా మనసు ఏదో అమంగళాన్ని శంకింపసాగింది. ఒకనాడు దూరపు బంధువొకాయన నేనక్కడున్నానని

జ్ఞప్తికి తెచ్చుకుని, వెదుక్కుంటూ మా ఇంటికి వచ్చాడు. ఆయన మూలంగా అసలు విషయం తెలిసింది.

"మీ నాన్న పరంధామయ్యకు ఆశ్రయమిచ్చినట్టుగా రాశాడా అమ్మాయ్? అయ్యో పాపం!" అంటూ ఆయన నిట్టూర్చాడు "నిజానికి పరంధామయ్యే మీ నాన్నకు ఆశ్రయమిచ్చాడనుకోవాలి. ఎందుకంటే అతడెప్పుడో మీ ఇంటిని కొనేశాడు. నీ పెళ్ళయిన కొత్తలోనే అది పరంధామయ్య పేరిట విక్రయమైపోయింది" అన్నాడు.

"అయ్యయ్యో ఇంటిని అమ్మేశారా? మా అమ్మా, నాన్న ఎక్కడుండేటట్టండి?" అంటూ దిగాలు పడిపోయాను.

"పల్లెలో ఇల్లుందటగా! అక్కడికి వెళ్ళిపోయినట్టు తెలిసింది" అన్నాడాయన.

పల్లెలో ఇల్లు! అది మా తాత ముత్తాతల నాటిది. గోడలు పడిపోయి మట్టి దిబ్బలు మిగిలి ఉన్నాయి. దూలాలు విరిగిపోయి చెదలపాలయ్యాయి. జిల్లేళ్ళు, ఉమ్మెత్తలు పెరిగే చోటు. పాములు, తొండలు తిరిగే చోటు. ఆ శిథిలాల్లో రెండు ముసలి ప్రాణాలు...

నాకు మతిపోయింది. సోఫాలో వాలి సొమ్మసిల్లి పోయాను. వచ్చిన బంధువు ఎప్పుడు వెళ్ళాడో గూడా నాకు తెలియదు. ఆయన వెళ్ళిపోయాడని తెలిశాక బిగ్గరగా ఏడ్చేశాను. సాయంకాలం దాకా కన్నీళ్ళు ధారాపాతంగా స్రవిస్తూనే ఉండిపోయాయి. రాత్రి ఎనిమిదింటికి ఇంటికి చేరుకున్న శ్రీవారు "ముఖం వాచిపోయినట్టుందేమిటి సత్యా! ఒంట్లో బాగుండలేదా?" అని పరామర్శించారు.

ఆరోగ్యం బాగుండలేదంటే "డాక్టరు దగ్గరికి వెళ్దాం. బయల్దేర"మంటారు. మనసు బాగా లేదంటే సెకండ్ షో సినిమాకు వెళ్దామంటారు 'అబ్బే, అలాంటిదేం లేదులెండి." అంటూ ముఖం చాటు చేసుకున్నాను.

మగవాళ్ళు కొందరు భార్యల్ని తమ ముంజేతి రామచిలుకలుగా భావిస్తారు. మంచిదే! కానీ వాళ్ళకోసం తాము సృష్టించి పెట్టినవి బంగారు పంజరాలని ఎందుకు గ్రహించరు?

♦ *'జ్యోతి' మాసపత్రిక-1986* ♦